

గోవర్ధనగిరి గొంతెండుతోంది..
తాగునీరు రాక సరిగా ఎనిమిది రోజులు గడిచింది. దీంతో గోవర్ధనగిరి వాసులు గుక్కెడు నీటికి అల్లాడుతున్నారు. 9లో..



పోలీసులమని చెప్పి అక్రమ వసూళ్లు
సదాశివపేట జాతీయ రహదారిపై వాహనదారులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న వారిని పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. 8లో..



శాస్త్రవేత్తకు నివాళి
ములుగు(గజ్వేల్): ప్రముఖ ఉద్యాన శాస్త్రవేత్త బ్రహ్మసింగ్ సంస్మరణ సభ సోమవారం ములుగు తెలంగాణ రాష్ట్ర కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బి.నీరజప్రభాకర్, భగవాన్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

చిన్నకోడూరు(సిద్దిపేట): పల్లెల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. సోమవారం చౌడారం మదిర గ్రామం ఎల్లమ్మజాలులో రూ.2.85 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, సర్పంచ్ అనిత బాలయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్, నాయకులు భూంరెడ్డి, మల్లేశం గౌడ్ పాల్గొన్నారు.

బయోటెక్నాలజీ విద్యార్థినికి మెరిట్ గోల్డ్ మెడల్



అవార్డు అందుకుంటున్న నిఖిత

సిద్దిపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని అటానమస్ డిగ్రీ కళాశాల విద్యార్థిని నిఖిత బయోటెక్నాలజీలో కనబరిచిన ప్రతిభకు లావిన్ లాబొరేటరీస్ అధినేత డాక్టర్ పబ్బ శివకష్ణ మెరిట్ గోల్డ్ మెడల్ అవార్డ్‌ను సోమవారం అందజేశారు. అనంతరం ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.హుస్సేన్, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.సుమలత, తదితరులు అభినందించారు.

ఆవేదన సభకు జిల్లా ఉపాధ్యాయ దంపతులు



సభలో సిద్దిపేట జిల్లా ఉపాధ్యాయ దంపతులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర స్పౌజ్ ఫోరం ఆధ్వర్యంలో విద్యాశాఖలో ఆగిపోయిన ఉపాధ్యాయ దంపతుల బదిలీలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇందిరా పార్క్ వద్ద ఆవేదన సభ నిర్వహించారు. ఈ సభకు జిల్లాకు చెందిన ఉపాధ్యాయ దంపతులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు కృష్ణ, బాలస్వామి, ప్రవీణ్, మల్లికార్జున్, నాగరాజు, సంతోషి, రేణుక, 60 మంది ఉపాధ్యాయ దంపతులు పాల్గొన్నారు.

'మిషన్ భగీరథ' అద్భుతం



కోమటిబండగుట్టపై మహారాష్ట్ర మాజీ శాసనసభ్యుల బృందం

గజ్వేల్‌రూరల్: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చేపట్టిన మిషన్ భగీరథ పథకం అద్భుతమని మహారాష్ట్రకు చెందిన మాజీ శాసనసభ సభ్యుల బృందం కొనియాడింది. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్ మండలం కోమటిబండగుట్టపై నిర్మించిన మిషన్ భగీరథ హెడ్‌వర్క్స్ ప్రాంతాన్ని సోమవారం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ పథకం రూపకల్పన, నీటి శుద్ధీకరణ, తాగునీటి సరఫరా తదితర అంశాల గురించి అధికారులు వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ హరేరాం, మిషన్ భగీరథ పథకం ఈఈ రాజయ్య, కాళేశ్వరం పర్యవేక్షక ఇంజనీర్ వెంకటేశ్వర్‌రావు, మిషన్ భగీరథ డీఈఈ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు

సిద్దిపేట ఎడ్యుకేషన్: జాతీయ ఫిష్ ఫార్మర్స్ డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆక్వా రైతుల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కే.హుస్సేన్ తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేపల ఉత్పత్తిపై రైతులకు మరింత అవగాహన కలిగించేందుకు ఎంఎస్సీ ఫిషరీస్ విద్యార్థులచే హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐక్యూఏసి కో ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్.మధుసూదన్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ గోపాల సుదర్శనం, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.పల్లవి, అధ్యాపకులు డాక్టర్ టి.జగదీశ్వరచారి, భరత్ కుమార్, అర్చన, రాంకుమార్, షాకీర్ పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

సిద్దిపేటరూరల్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి దోహదపడుతుందని అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ పలు సమస్యలకు సంబంధించి మొత్తం 46 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ లక్ష్మీకిరణ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తన తండ్రి పేరిట ఉన్న ఎకరం పొలాన్ని చిన్నాన్న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని కొహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన మాంకాల బాలయ్య ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా బెజ్జంకి మండలం గూడెం గ్రామానికి చెందిన దళితులు పట్టా పుస్తకాలు అందించాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 2017లో గ్రామంలో ఎల్‌పీఎస్ పథకం ద్వారా ప్రభుత్వం 34 మంది దళిత లబ్ధిదారులకు 3 ఎకరాల భూమిని అందజేసిందని, 2020 డిసెంబర్ 8 బెజ్జంకి ఎమ్మార్వో, మానుకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సూచనల మేరకు రిజిస్ట్రేషన్ దస్తావేజులతో ధరణిలో మ్యూటేషన్ కు దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. అందులో 26 మందికి మాత్రమే మ్యూటేషన్ అమలు ద్వారా భూమి మార్పిడి చేసి పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారని తెలిపారు. మిగతావారికి ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. అలాగే తమ భూములకు సంబంధించి ధరణిలో జరిగిన తప్పులు సరిచేసి పాస్ పుస్తకాలు అందజేయాలని జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లి గ్రామస్థులు ప్రజావాణిలో దరఖాస్తు పెట్టుకున్నారు. ×గ్రామంలోని 101 సర్వే నెంబర్‌లో 95 ఎకరాల భూమి ఉండగా, 170 మంది పేర్లపై ధరణిలో చూపిస్తుంది. కానీ అక్కడ 120 మంది రైతులు మాత్రమే వ్యవసాయం చేస్తున్నారు. మిగిలిన వారి పేర్లు తప్పుగా నమోదు చేయడంతో పాటు, చనిపోయిన వారి పేర్లను కూడా అందులో చేర్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, అసలైన వారి పేర్లను మాత్రమే ధరణిలో ఎక్కించాలి₹ అని గ్రామస్తులు వేడుకున్నారు.

ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించాలి

సిద్దిపేటరూరల్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఈవీఎం, వీవీప్యాడ్ మిషన్ల అవగాహన ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రచార రథాలు వెళ్లే రూట్ మార్గాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సిబ్బంది శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ప్రచార రథాలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గీత కార్మికులు

సిద్దిపేటరూరల్: కల్లు గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్ అన్నారు. సోమవారం డిమాండ్లు నెరవేర్చాలని కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గీత కార్మికునికి మోటార్ బైకు, ఉచితంగా సేఫ్టీ మోకులు అందించాలన్నారు. అదేవిధంగా రాష్ట టాడి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని కోరారు. బీసీ కుల వృత్తిదారులకు ప్రభుత్వం ఇస్తామన్న రూ.లక్ష సాయం గౌడ కులస్థులకు కూడా అందించాలన్నారు. గీత కార్మికులు సాధారణ మరణం పొందితే రూ.5లక్షల బీమా అందించాలన్నారు. ధర్నాకు జిల్లాలోని 2వేల మంది కల్లు గీత కార్మికులు వ్యక్తిగత దరఖాస్తులతో వచ్చారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఓకు అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కోహెడ కొమురయ్య గౌడ్, గౌరవాధ్యక్షులు దుద్దేడ మాజీ సర్పంచ్ పెద్దంకుల శ్రీనివాస్, దాచారం సర్పంచ్ పెంటమిది శ్రీనివాస్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మేరింద్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలి

సిద్దిపేటరూరల్: ఐసీడీఎస్ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో అధిక నిధులు కేటాయించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా చేపట్టారు. టీచర్లు, హెల్పర్లు నల్ల చీరలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపాలస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. 2017 నుంచి అంగన్‌వాడీ ఉద్యోగులకు టీఏ, డీఏలు చెల్లించడం లేదన్నారు. ఈ మహా ధర్నాలో జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.పద్మ, జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, కోశాధికారి పద్మ, శారద, లక్ష్మి, విజయ, మల్లేశ్వరి, స్వరూప రాణి, మంజుల, కవిత, ప్రేమలత, భూలక్ష్మి, రమ, అనిత, మాధవి, వసంత, టీచర్స్, ఆయాలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

అవినీతి ఆధారాలు ఈడీకి అందించాం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరోత్తంరెడ్డి

సిద్దిపేటకమాన్: మంత్రి హరీశ్‌రావుకు సంబంధించి అవినీతి ఆధారాలు ఈడీకి అందించామని, త్వరలోనే ఆయన ఆ కార్యాలయం మెట్లు ఎక్కుతారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరోత్తంరెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికల వాతావరణం నెలకొందని, దీంతో రకరకాల సమీకరణాలు మారుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గంపై చర్చ జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో మంత్రి హరీశ్‌రావు లక్ష ఓట్ల మెజార్టీ సాధించడం, ఎన్నికల నిర్వహణలో అవకతవకలు జరిగాయని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. సిద్దిపేటలో కేంద్ర బలగాల మధ్య ఎన్నికలు జరిపించాలని మంత్రి కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. కోమటి చెరువు సందర్శనకు వచ్చే పర్యాటకుల నుంచి చార్జీలు వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు జనార్దన్, మహిపాల్, శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్టారెడ్డి, ఉమారాణి, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరోత్తంరెడ్డి

కసరత్తు షురూ

- జీవో 59 దరఖాస్తులపై విచారణ ప్రారంభం
- పరిశీలనకు 18 టీమ్‌లు ఏర్పాటు
- జిల్లా వ్యాప్తంగా 3,710 మంది దరఖాస్తు
- సిద్దిపేట అర్బన్ మండలం నుంచే అధికం



ప్రభుత్వ స్థలాలకు, చెరువు శిఖం స్థలాల సర్వే నంబర్లను తెలుపుతున్న సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ విజయ్ సాగర్

సాక్షి, సిద్దిపేట: ప్రభుత్వ భూమిలో నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణకు జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు 2014లో ప్రభుత్వం జీవో 58, 59 జారీ చేసి అర్హులకు రిజిస్ట్రేషన్ చేసి అందజేశారు. ఈ జీఓను జూన్ 2, 2020 వరకు ఇంటి నిర్మాణం చేసుకున్న వారికి సైతం వర్తింప చేస్తూ మే 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో వీటి పరిశీలనను వేగవంతం చేశారు. జిల్లా వ్యాప్తంగా 4,018 దరఖాస్తులు వచ్చాయి. వీటి పరిశీలన సోమవారం నుంచి ప్రారంభమైంది.

జిల్లా వ్యాప్తంగా 18 టీంలు ఏర్పాటు

- ఇళ్ల క్రమబద్ధీకరణకు జిల్లా వ్యాప్తంగా 59 జీఓకు 3,710 మంది దరఖాస్తు చేసుకోగా, 58 జీఓకు 308 మంది దరఖాస్తు చేశారు. 59జీవో కింద వచ్చిన దరఖాస్తులను పరిశీలించేందుకు జిల్లా అధికారులతో 18 టీంలను కలెక్టర్ ఏర్పాటు చేశారు. ఒక్కో టీంకు సుమారుగా 250 దరఖాస్తులు అప్పగించారు.
- దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి జిల్లా, డివిజన్‌స్థాయి అధికారితో పాటు ఒక సహాయకుడు, స్థానికంగా ఉండే ఉద్యోగిని నియమించారు. సిద్దిపేట ఆర్‌డీఓ కార్యాలయంలో సోమవారం సిద్దిపేట అర్బన్ మండల తహసీల్దార్ విజయ్ సాగర్ సమావేశం అయ్యారు. ప్రభుత్వ భూములు, చెరువు శిఖంలకు సంబంధించిన సర్వే నంబర్ల వివరాలను అధికారులకు అందజేశారు.
- సెల్‌ఫోన్‌లో జీవో 59కి సంబంధించిన ప్రత్యేక యాప్‌ను డౌన్‌లోడ్ చేశారు. యాప్‌లో దరఖాస్తు నంబరు నమోదు చేయగానే దరఖాస్తుదారుడి వివరాలు వస్తున్నాయి. దాని ప్రకారం విచారణ జరుపుతున్నారు.
- 2020 జూన్ 2వ తేదీ కంటే ముందు నిర్మించిన ఇంటి వివరాలు, ఇంటి పన్నులు, విద్యుత్ బిల్లు, కుళాయి పన్ను, స్థలం సంక్రమించిన తీరు, సర్వే నంబర్లు, వ్యక్తిగత గుర్తింపు పత్రాలు తదితర అంశాలను తెలుసుకుంటున్నారు. విచారణలో భాగంగా ఇంటి ముందు ఒక ఫొటోను కూడా తీసుకుంటున్నారు.

సిద్దిపేట అర్బన్ మండలంలో..

- జీవో 59 కింద జిల్లా వ్యాప్తంగా వచ్చిన 3,710 దరఖాస్తులు రాగా, అందులో సిద్దిపేట అర్బన్ మండలం నుంచి అధికంగా వచ్చాయి. సిద్దిపేట అర్బన్ మండలంలో 2,061 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అధికార, ప్రతిపక్షాల నాయకులకు చెందిన దరఖాస్తులే ఎక్కువ ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని స్థలాలకు ఇంటి నెంబర్లు కేటాయించడంతో వారు సైతం క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు.
- 58జీవోకు సంబంధించిన దరఖాస్తులలో 125 చదరపు గజాలలోపు స్థలంలో నిర్మాణాలు చేపడితే ప్రభుత్వం ఉచితంగానే క్రమబద్ధీకరించనుంది. 250 చదరపు గజాలలోపు ఉన్నవాటిని మార్కెట్ విలువలో 50 శాతం, 250 నుంచి 500 గజాలలోపు ఉన్న ఇళ్లకు 75 శాతం, అంతకంటే ఎక్కువ విస్తీర్ణం ఉంటే వందశాతం రుసుము వసూలు చేయనున్నారు.

అర్హులందరికీ పట్టాలు



దౌల్తాబాద్ మండలం దొమ్మాటలో విచారణ చేస్తున్న డీపీఓ దేవిక దేవి

రాయపోలు(దుబ్బాక): ప్రభుత్వ భూములలో నివాస గృహాలు నిర్మించుకున్న వారి స్థలాలను రెగ్యులరైజ్ చేసే ప్రక్రియ కొనసాగుతుందని, అర్హులందరికీ పట్టాలు ఇస్తామని డీపీఓ దేవిక దేవి అన్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని దౌల్తాబాద్, దొమ్మాట, ముబారస్‌పూర్‌లలో 59 జీఓ కింద వచ్చిన దరఖాస్తులపై సోమవారం ఆమె విచారణ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు పూజిత, యాదగిరి, అధికారులు ఉన్నారు.

హాఫ్ మారథాన్‌లో జర్నలిస్టులు పాల్గొనాలి

సిద్దిపేటకమాన్: హాఫ్ మారథాన్‌లో జర్నలిస్టులు పాల్గొనాలని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రంగాచారి పిలుపునిచ్చారు. సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 6న నిర్వహించబోయే హాఫ్ మారథాన్ రన్ కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ..హాఫ్ మారథాన్‌కు జర్నలిస్టుల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. రన్‌లో పాల్గొనాలనుకునే వారు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు యాదవరెడ్డి, పాండు, సంజీవరెడ్డి, మైసారెడ్డి, రామకృష్ణ, నరేష్, సాయిగౌడ్, చందు, పర్శరాములు, రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు రాజు, బాపురెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జర్నలిస్టులు, రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు

చట్టానికి అందరూ సమానులే



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ, ఆర్డీఓ

ఏపీసీ రమేష్, ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): చట్టానికి అందరూ సమానులేనని, దానిని ప్రతి ఒకరూ గౌరవించాలని ఏసీపీ రమేష్, ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో కుల వివక్ష ఘటనపై గ్రామాన్ని సందర్శించారు. దళిత కాలనీలో అన్ని కులాల పెద్దలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి వివక్షత చూపావద్దని, దేవాలయాలకు అందరూ వెళ్లవచ్చని చెప్పారు. అలాగే హెయిర్ కటింగ్ దుకాణాల్లో వివక్ష చూపొద్దని కోరారు. కుల వివక్షత చూపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామంలో అన్ని కులాల పెద్దలు కలిసి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో మనోభావాలు దెబ్బతీసే విధంగా పోస్టులు పెట్టవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కృష్ణమూర్తి, తహసీల్దార్ రఘువీరారెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మీరమేష్ పాల్గొన్నారు

టమోత

- ఘాటెక్కిన పచ్చి మిర్చి
- సిద్దిపేట రైతు బజారులో కిలో ధర రూ.100పైనే
- పెరిగిన ధరలతో సామాన్యులు బెంబేలు

సాక్షి, సిద్దిపేట: టమాటా మోత మోగిస్తోంది. మిర్చి ఘాటెక్కుతోంది. రైతు బజార్, మార్కెట్లో కూరగాయల ధరలు కొండెక్కాయి. అవసరాలకు సరిపడా కూరగాయలు లేకపోవడంతో రేట్లు పెరిగి ప్రజలు అల్లాడిపోతున్నారు. 20 రోజుల్లో అన్ని రకాల కూరగాయల ధరలు రెట్టింపయ్యాయి. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతుంటే.. పెరిగిన కూరగాయలు ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. సోమవారం సిద్దిపేటలోని రైతు బజార్‌లో కిలో టమాటా రూ 100 విక్రయించారు. గతనెల 22న కిలో టమాటా ధర రూ.26 ఉండగా.. సోమవారం రూ.100కు చేరింది. మార్కెటకు వచ్చే టమాటా సైతం నాణ్యతగా ఉండటం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

అదే దారిలో మిర్చి

తినకముందే పచ్చి మిర్చి మండుతోంది. కిలో రూ104కు అమ్ముతున్నారు. ఇతర కూరగాయాలు సైతం ధరలు ఎక్కువగా ఉన్నాయి. రోజు కూరలో మహిళలు టమాటా, మిర్చి తప్పకుండా వినియోగిస్తారు. అలాంటి వాటి ధరలు ఆకాశాన్నంటడంతో ఆందోళన చెందుతున్నారు.

తగ్గిన సాగు.. పెరిగిన ధరలు

వడగళ్ల వానలకు కాయగూరల పంటలు బాగా దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడి తగ్గింది. 2021–22 వానా కాలం టమాటాను 1,563 మంది రైతులు 952 ఎకరాలు, 2021–22 యాసంగిలో 3,050 మంది రైతులు 1,936 ఎకరాలు, 2022–23 వానాకాలంలో 1,737 మంది 1,173 ఎకరాలు, యాసంగి 1,392 మంది 993 ఎకరాలు సాగు చేశారు. గతేడాది యాసంగితో పోల్చితే యాసంగిలో 943 ఎకరాల టమాటా సాగు తగ్గింది. సిద్దిపేట జిల్లా నుంచే ఎక్కువగా హైదరాబాద్‌కు కాయగూరలను రైతులు సరఫరా చేస్తుంటారు.

జులైలో ధరల వివరాలు

తేదీ	కిలో రూ.లలో
6	80
7,8	92
9	76
10	100



సిద్దిపేట రైతు బజార్ ధరల పట్టిక



రైతు బజార్‌లో అమ్ముతున్న నాసిరకం టమాటాలు

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


దుర్గయ్య (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ మధుసూదన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధి శెరీల గ్రామానికి చెందిన నల్ల దుర్గయ్య(38) కుటుంబ పోషణ నిమిత్తం చేసిన అప్పులు పెరిగిపోవడంతో వాటిని తీర్చేందుకు మార్గం కనిపించకపోవడంతో వెల్దుర్తి గ్రామ శివారులో తన గొర్రెల పాక వద్ద ఆదివారం రాత్రి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్టార్టర్ డబ్బాల ధ్వంసం


పెద్ద చింతకుంటలో బోరుబావి వద్ద ధ్వంసం చేసిన స్టార్టర్ డబ్బ

నర్సాపూర్ రూరల్: వ్యవసాయ బోరు మోటార్ల స్టార్టర్ డబ్బాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తున్నారని మండలంలోని పెద్ద చింతకుంట రైతులు సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా బోరు బావుల వద్ద రాత్రి వేళల్లో స్టార్టర్లను ధ్వంసం చేస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారన్నారు. ధ్వంసమైన స్టార్టర్ల స్థానంలో కొత్తవి బిగించినా మళ్లీ రెండు మూడు రోజులకే స్టార్టర్లను ధ్వంసం చేస్తూ నష్టపరుస్తున్నారని వారు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


గేదె కళేబరం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని మాదారం గ్రామంలో రవి అనే రైతుకి చెందిన గేదె సోమవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. రూ.లక్ష వరకు తనకు నష్టం వచ్చినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని పలు దుకాణాలపై ముస్కాన్ టీం సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మెకానిక్, మార్బుల్ దుకాణాలలో పని చేస్తున్న 5మంది బాలకార్మికులను వారు గుర్తించారు. ఈ సందర్భంగా దుకాణ యాజమానులపై కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి అదృశ్యం


మాసని లక్ష్మమ్మ

కౌడిపల్లి(నర్సాపూర్): పొలానికి వెళ్లివస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన వృద్ధురాలు తిరిగి రాలేదు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం..కౌడిపల్లి మండలం రాజిపేట గ్రామానికి చెందిన మాసని లక్ష్మమ్మ(70), గత నెల 18వ తేదీన సాయంత్రం ఇంటి నుంచి పొలానికి వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన వారివద్ద, బంధువులవద్ద వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. ఇల్లరికం అల్లుడు మాసని నర్సింలు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

నారాయణఖేడ్: గిరిజనతండాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ప్రకాష్ రాథోడ్ డిమాండ్ చేశారు. తండాల పర్యటనలో భాగంగా సోమవారం ఆయన లొంకతండాలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖేడ్ నియోజకవర్గంలోని అత్యధిక తండాలకు ప్రధాన అంతర్గత రహదారులు, వీధిదీపాలు, మురుగు కాల్వలు తదితర మౌళిక సదుపాయాలు కొరవడ్డాయన్నారు. ప్రభుత్వం స్పందించి తండాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాస్‌నాయక్, నాయకులు రాథోడ్ వినోద్, శివాజీ నాయక్, వినోద్‌నాయక్, గోపాల్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత



సిద్దిపేటకమాన్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్. శ్వేత సూచించారు. సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో సోమవారం జరిగిన పలు సైబర్ మోసాల గురించి ఆమె వివరించారు. పలువురు బాధితులు రూ.3,55,000 కోల్పోయినట్లు సీపీ పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో పెట్టుబడి పేరుతో మోసం

- సిద్దిపేట వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో పాస్బరీఅంకెమట్కా యాప్‌లో పెట్టుబడి పెడితే డబ్బులు రెట్టింపు అవుతాయనే సమాచారం చూసి పలు ధపాలుగా ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా రూ.1,50,000 పంపించాడు. తర్వాత ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో అనుమానంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయగా బాధితుడు పంపిప ఖాతాలో ఉన్న రూ.8వేలు ఫ్రీజ్ చేశారు.
- సిద్దిపేట టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ మహిళ ఆన్‌లైన్‌లో తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని చూసి రూ.30వేలు పెట్టుబడిగా పెట్టింది. తర్వాత డబ్బులు పంపిన నెంబర్‌కు ఫోన్ చేయగా ఎలాంటి స్పందన లేకపోవడంతో బాధితురాలు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేయగా స్పందించిన పోలీసులు బాధితురాలు పంపిన ఖాతాలో ఉన్న రూ.30వేలు ఫ్రీజ్ చేశారు.
- ములుగు పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి కన్సల్టెంట్ ద్వారా విదేశాలకు వెళ్లే ప్రయత్నంలో ఆన్‌లైన్‌లో ఉన్న నెంబర్ ద్వారా ఓ కన్సల్టెంట్‌ను సంప్రదించాడు. గుర్తు తెలియని వ్యక్తి విదేశాలకు వెళ్లడానికి ముందుగా డబ్బులు చెల్లించాలని తెలిపాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి సూచించిన నెంబర్‌కు ఆన్‌లైన్‌లో పలు ధపాలుగా రూ.70,500 పంపించాడు. తర్వాత ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా ఎలాంటి స్పందన లేకపోవడంతో అనుమానంతో బాధితుడు 1930కు ఫిర్యాదు చేయగా బాధితుడు పంపించిన ఖాతాలో ఉన్న రూ. 5వేలు ఫ్రీజ్ చేసినట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు.
- గజ్వేల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ మహిళకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఇండియన్ బుల్స్ నుంచి మాట్లాడుతున్నట్లు పరిచయం చేసుకుని మీకు రూ.2లక్షల లోన్ మంజూరైనట్లు తెలిపాడు. దీనికి గాను ముందుగా కొంత మొత్తం డబ్బులు చెల్లించాలని తెలిపాడు. ఆ మాటలు నమ్మిన బాధితురాలు ఆన్‌లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తికి రూ.79,560 పంపించి సైబర్ మోసానికి గురైంది.
- సిద్దిపేట త్రీ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఎస్‌బిఐ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నానని, పాన్ కార్డు వివరాలు ఖాతాకు అప్‌డేట్ చేయాలని సూచించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తికి పాన్ కార్డు వివరాలతో పాటు తన సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ వివరాలు తెలిపాడు. దీంతో బాధితుడి ఖాతా నుంచి రూ.25,000 డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో అనుమానం వచ్చిన బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు..

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రూ.73వేలు, మరో ఉద్యోగి రూ.4,50,000లు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..అమీన్‌పూర్ పరిధిలోని హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి ఏప్రిల్ 14వ తేదీన వాట్సాప్‌కు ఓ మెసేజ్ వచ్చింది. దీనికి స్పందించి బాధితురాలు తన వివరాలను నమోదు చేసి నగదు పెట్టుబడి పెట్టింది. ఇచ్చిన టాస్కులు పూర్తి చేసింది. ఈ క్రమంలో తను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని కోరింది. దీంతో సదరు సైబర్ మోసగాళ్లు స్పందించలేదు. చేసేదేమిలేక తను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మరో ఘటనలో..

బీరంగూడ బాలజీ నగర్ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జూన్ 11వ తేదీన వాట్సాప్‌కు పార్ట్ టైం జాబ్ అంటూ మెసెజ్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన విధంగా నగదు ఇన్వెస్ట్ చేస్తూ పలు ధపాలుగా రూ.4.50లక్షలు పెట్టాడు. ఇచ్చిన టాస్కులు పూర్తి చేశాడు. దీంతో బాధితుడు తను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని కోరాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి స్పందించలేదు. బాధితుడు మోసపోయినట్లుగా గుర్తించి ముందుగా సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మహిళల భద్రతకు షీటీమ్స్


హాజరైన విద్యార్థినులు

మాట్లాడుతున్న ఏసీపీ సతీశ్

ఏసీపీ సతీశ్

హుస్నాబాద్: మహిళలు, బాలికల రక్షణకు షీటీమ్స్ పని చేస్తున్నాయని ఏసీపీ సతీశ్ అన్నారు. మండలంలోని పోతారం(ఎస్) మహాత్మాజ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాలలో బాలికలు, మహిళల రక్షణకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ సతీశ్ మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా బాల బాలికల రక్షణ, మహిళల రక్షణ గురించి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్నేహిత మహిళా సపోర్టు సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ఎవరైనా మానసికంగా, శారీరకంగా గృహహింసకు గురైతే వెంటనే మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

సమస్య తీవ్రతను బట్టి భార్యభర్తకు, పిల్లలకు రెండు, మూడు సార్లు కౌన్సిలింగ్ ఇవ్వబడుతుందన్నారు. విద్యార్థినిలు పాఠశాలలో చదువుకునే సమయంలో ఒక గోల్ ఏర్పాటు చేసుకొని దానికి అనుగుణంగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గా, హుస్నాబాద్ సీఐ కిరణ్, ఎస్సై మహేష్, పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ, షీటీమ్స్ సభ్యులు ఉన్నారు.

నేను ఎవరికీ కోవర్టు కాదు


నూతన మండల అధ్యక్షులను సన్మానిస్తున్న తిరుపతిరెడ్డి

డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

మెదక్‌జోన్: నా పిల్లల సాక్షిగా ప్రమాణం చేసి చెబుతా.. ఎవరికీ కోవర్టును కాను. నిరూపిస్తే ప్రజల సమక్షంలో ముక్కు నేలకు రాస్తా.. అంటూ డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన మండలాల నూతన అధ్యక్షుల సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే భర్త దేవేందర్‌రెడ్డికి కోవర్టునంటూ కొందరు కావాలని ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ కోసం పని చేయకుంటే రెండోసారి ఎందుకు డీసీసీ ఇస్తారని అన్నారు. లేనిపోని ఆరోపణలు చేసేవారి జాతకం త్వరలో ఆధారాలతో సహా బయటపెడతానని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని, మెదక్ ఖిల్లాపై కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు.

12 నుంచి గడప గడపకు కాంగ్రెస్..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేయబోయే పనులపై ప్రజలకు వివరించేందుకు ఈ నెల 12నుంచి నియోజకవర్గంలో ఇంటింటా యాత్ర చేయనున్నట్లు తెలిపారు. ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, రూ.500లకే సిలిండర్, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రూ.4 వేల పింఛన్, నిరుద్యోగ భృతిపై ఇంటింటా ప్రజలకు వివరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మామిళ్ల ఆంజనేయులు, మహేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పోతరాజు రమణ, ఆంజనేయులుగౌడ్, మంజుల, శ్రీనివాస్ ఉన్నారు.

ఆర్యవైశ్యులకు భవనం కేటాయించాలి


మంత్రి హరీశ్‌రావును కలిసిన ఆర్యవైశ్యులు

సంగారెడ్డి మున్సిపాలిటీ : ఆర్యవైశ్య సంఘం భవనానికి సంగారెడ్డిలో స్థలం కేటాయించాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపాజీ అనంత కిషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని అనంత కిషన్ తెలిపారు. మంత్రి హరీశ్‌రావుకు వినతి పత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తోపాజి ఆనంద్ కిషన్ గుప్తా, జిల్లా మహాసభ అధ్యక్షుడు మునిగాల మాణిక్ ప్రభు గుప్తా, జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు జూకంటి లక్ష్మణ్ గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీ కోటగిరి సతీష్ గుప్తా, ఉపాధ్యక్షుడు చేనూరి భాస్కర్ గుప్తా, మా శెట్టి ప్రకాశం గుప్తా దిడి గే, నగేష్ గుప్తా, కందికృష్ణమూర్తి, నగేష్ చౌదరి, గంగయ్య, పంతంగి రమేష్, కొంపల్లి విద్యాసాగర్, పాంపాటికృష్ణమూర్తి, ఆమెటి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు బీమా కల్పించాలి


కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న కల్లుగీత కార్మికులు

మెదక్ కలెక్టరేట్: కల్లు గీత కార్మికులకు బీమా కల్పించి ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని గీత కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం గీత కార్మికులతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి. అనంతం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి లచ్చగౌడ్‌తో కలిసి మాట్లాడారు. నిత్యం ప్రమాదంతో కూడిన గీత వృత్తిలో కార్మికులకు బీమా లేక ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఏజెన్సీ ఏరియాలో గీత కార్మికుల సొసైటీలు పునరుద్ధరించాలని, నీరా కేంద్రాలను విస్తరించాలని, యువతకు తాటి, ఈత ఉత్పత్తులపై శిక్షణ అందించి పరిశ్రమలు స్థాపించేలా సహకారం అందించాలన్నారు. రూ.5వేల పింఛను, 5ఎకరాల భూమి, గీత కార్పొరేషన్ బడ్జెట్లో నిధులు కేటాయింపు చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌడ జన హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు గోవర్ధన్ గౌడ్, కృష్ణాగౌడ్, రామ గౌడ్, అశోక్‌గౌడ్, జై గౌడ్, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్ గౌడ్, సత్య గౌడ్, హన్మ గౌడ్ పాల్గొన్నారు.

శ్రీరామమందిరంలో ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నారాయణఖేడ్: ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జయశ్రీరెడ్డి దంపతుల 35వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఖేడ్‌లోని శ్రీరామమందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాగల్‌గిద్ద మండల బీఆర్ఎస్ అధ్యక్షులు పండరి, ఖేడ్ నియోజకవర్గ కురుమ సంఘం ఉపాధ్యక్షులు మల్లొండ, నాయకులు లక్ష్మణ్‌నాయక్, సల్మాన్, సాయిలు, మోహన్ పాల్గొన్నారు.

కొడుకు ఆచూకీ తెలియక ఆందోళన


ఆందోళనలో విద్యార్థి కుటుంబ సభ్యులు

బన్నీ (ఫైల్)

- మహారాష్ట్ర వైపు వెళ్లినట్లు సీసీ పుటేజీ లభ్యం
- దర్యాప్తు చేపట్టిన బాసర పోలీసులు

తూప్రాన్: బాసర ఐఐఐటీలో రెండో సంవత్సరం చదువుతున్న మెదక్ జిల్లా తూప్రాన్ మండలం నర్సంపల్లికి చెందిన కత్తుల బన్నీ(19) ఆచూకీ ఇంకా దొరకలేదు. సీసీ పుటేజీలో మహారాష్ట్ర వైపు వెళుతున్నట్లు చూపిస్తున్నప్పటికీ స్పష్టమైన ఆచూకీ తెలియలేదు. నర్సంపల్లికి చెందిన విద్యార్థి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు విద్యార్థి ఆచూకీ కోసం బాసర పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులను 'సాక్షి' పలకరించింది. గురువారం సాయంత్రం తల్లి పద్మకు ఫోన్‌చేసి 'అన్నం తిన్నారా' అని పలకరించినట్టు తిన్నామని..బదులిచ్చినట్టు, నీవు తిన్నావా..అని కొడుకును అడిగినట్టు తల్లి రోదిస్తూ వివరించింది. తమ క్షేమ సమాచారం తెలుసుకున్నాడని తల్లిదండ్రులు తెలిపారు. ఆ తర్వాత ఏమి జరిగిందో తమకు తెలియదన్నారు. ఆదివారం సెలవురోజు కావడంతో సాయంత్రం కుమారుడికి తల్లిదండ్రులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చిందన్నారు. దీంతో తన కుమారుడి స్నేహితుడికి ఫోన్ చేయగా గురువారమే ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లినట్టు స్నేహితుడు వివరించాడు. కాని విద్యార్థి బన్నీ ఇంటికి చేరుకోలేదు. ఇంటికి రావాల్సిన కుమారుడు రాకపోవడంతో తల్లిదండ్రుల ఆందోళన మరింత ఎక్కువైంది. పోలీసుల దర్యాప్తు కొనసాగుతుంది.

పోలీసులమని చెప్పి అక్రమ వసూళ్లు

నలుగురి రిమాండ్


మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): పోలీసులమని చెప్పి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న నలుగురిని పట్టుకుని రిమాండ్‌కు పంపించామని సంగారెడ్డి డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదాశివపేట పట్టణానికి చెందిన ఖలీల్(23), వినోద్(31) హైదరాబాద్‌లోని బోరబండకు చెందిన ఇమ్రాన్(22) అబ్దుల్ జాకీర్(31)లు కలిసి ఈ నెల 9వ తేదీన అర్ధరాత్రి 1గంట సమయంలో సదాశివపేట మండలం ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ వద్ద జహీరాబాద్ నుంచి లింగంపల్లికి ద్విచక్ర వాహనంపై వెలుతున్న రంజోల్ గ్రామానికి చెందిన బోడపల్లి శ్రీకాంత్(22) అతని స్నేహితుడు మాణిక్‌లను తాము పోలీసులమని బెదిరించి వారి వద్దగల రూ.2వేలు లాక్కున్నారు. అక్కడి నుంచి ఓ కారులో వారు పారిపోయారు. శ్రీకాంత్, మాణిక్‌ల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అనంతరం నిందితులను పట్టుకొని రిమాండ్‌కు పంపించారని డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి


వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగులకు ప్రతీనెలా 1వ తేదీన వేతనాలు అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి కోరారు. సోమవారం విద్యుత్ ఉద్యోగులతో కలిసి మెదక్ ఎస్‌ఈ కార్యాలయ యస్‌ఏఓకు వినతిపత్రం అందించారు. అనంతరం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. వేతనాల జాప్యంతో ఉద్యోగులు ఈఎంఐలు, ఇంటి అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో వేతనాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


పోచయ్య మృతదేహం

రాయపోలు(దుబ్బాక): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. దౌల్తాబాద్ ఎస్‌ఐ చైతన్యకుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన జనగామ పోచయ్య (34), సునందలకు ఇద్దరు పిల్లలు. తన వ్యవసాయ భూమిలో పంట సరిగా పండకపోవడంతో రెండేళ్లుగా గజ్వేల్‌లో నివాసముంటూ ప్రజ్ఞాపూర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రి వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలోనే గ్రామంలోని వ్యవసాయ పనులకు అప్పుడప్పుడు వెళ్తుండేవాడు. ఆదివారం ఉదయం పొలం పనుల నిమిత్తం గ్రామానికి వెళ్లాడు. బోరుబావి నడవడం లేదని పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతు చేసేందుకు వెళ్లాడు. అక్కడ మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉచిత శిక్షణ

మెదక్ కలెక్టరేట్: సీసీటీవీ కెమెరాల ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌లలో పురుషులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం డైరెక్టర్ రాజేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల గ్రామీణ ప్రాంత అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 24 నుంచి నెలరోజులపాటు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. పూర్తి సమాచారం కోసం 9490103390, 9490129839 నంబర్లలో సంప్రదించొచ్చని తెలిపారు.

రెండు బైకులు ఢీ

ఇద్దరికి తీవ్రగాయాలు


దయాకర్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): రెండు బైకులు ఢీ కొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామానికి చెందిన శ్రవణ్‌కుమార్ తన బైక్‌పై మేడ్చల్ నుంచి దండుపల్లికి వస్తున్నాడు. జీడిపల్లి గ్రామానికి చెందిన అచ్యుత శ్రీకాంత్ తన బైక్‌పై జీడిపల్లి నుంచి కూచారం వైపు రాంగ్ రూట్‌లో వెళుతూ జాతీయ రహదారి-44పై ప్రయాణిస్తున్న శ్రవణ్‌కుమార్ బైక్‌ను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దుబ్బాకరూరల్‌లో..

దుబ్బాకరూరల్: బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం చిట్టాపూర్‌లో జరిగింది. ఎస్‌ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం..చిట్టాపూర్ గ్రామానికి చెందిన ర్యాకం దయాకర్(30), ర్యాకం చందు ఇద్దరు కలిసి దుబ్బాకకు వచ్చారు. ఆదివారం రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో తిరిగి ఇంటికి వెళ్తున్నక్రమంలో మార్గమధ్యలో మంతూరి రాములు పొలం వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడ్డారు. బైక్ నడుపుతున్న చందుకు స్వల్ప గాయాలు కాగా దయాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఇద్దరిని అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 11గంటల సమయంలో మృతి చెందాడు. మృతుని తండ్రి స్వామి దాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్సపొందుతున్న ఇద్దరి మృతి

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందారు.


సత్తయ్య (ఫైల్)

వర్గల్(గజ్వేల్): చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. బేగంపేట ఎస్‌ఐ అరుణ్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..సామలపల్లికి చెందిన పెంజర్ల సత్తయ్య(60), వ్యవసాయం చేసుకుంటు జీవిస్తున్నాడు. పాడి గేదె ద్వారా కొంత ఆదాయం సమకూర్చుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఇంటి వద్ద పాడిగేదెకు నీళ్లు పెడుతుండగా అది ఒక్కసారిగా ఛాతిపై బలంగా కుమ్మింది. దీంతో అతను అస్వస్థతకు గురయ్యాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు శనివారం లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

తొగుటలో..


రవి (ఫైల్)

తొగుట(దుబ్బాక): చికిత్స పొందుతున్న వ్యవసాయ కూలీ మృతి చెందాడు. ఈ సంఘటన మదిర గ్రామం ఇందిరానగర్‌లో జరిగింది. తొగుట ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన నాంచారుపల్లి రవి (37) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా రవి ఇంటి నిర్మాణం నిమిత్తం రూ.6 లక్షల వరకు అప్పులు చేశాడు. ఈ క్రమంలో కుటుంబ పోషణకు మరిన్ని అప్పులు చేయాల్సి వచ్చింది. దీంతో అప్పులు తీర్చే దారి కనిపించకపోవడంతో ప్రతి రోజూ మధన పడేవాడు. అప్పుల ఒత్తిడి తీవ్రమవ్వడంతో రవి ఆదివారం రాత్రి పురుగుల మందు తాగాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమ వారం మృతి చెందాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.